నేడు ఫిష్ ఆంధ్రా లబ్ధిదారుల ఎంపిక

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): ఫిష్ ఆంధ్ర లబ్ధిదారుల ఎంపిక శుక్రవారం నిర్వహించనున్నట్లు దుగ్గిరాల ఎంపీడీఓ శ్రీదేవి గురువారం తెలిపారు. తెనాలి మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు లబ్ధిదారుల ఎంపిక నిర్వహించనున్నామని, దరఖాస్తుదారులు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు తీసుకుని హాజరు కావాలని తెలిపారు.

పాఠశాల వార్షికోత్సవం

తాడికొండ: సృజనాత్మక, ఆధునిక పద్ధతుల్లో బోధనతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించవచ్చని మూర్తి ఫ్యాషన్స్ అధినేత జి.నారాయణమూర్తి చెప్పారు. గుంటూరు జిల్లా లాం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన పాఠశాల ప్రథమ వార్షికోత్సవాన్ని హిందూ కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎస్‌వీఎస్ లక్ష్మీ నారాయణ, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి.రామచంద్రమూర్తి రాజులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ చుక్కపల్లి రమేష్, డైరెక్టర్లు చుక్కపల్లి రాకేష్, చుక్కపల్లి ప్రియాంక, ప్రిన్సిపల్ ఉషారాణి పాల్గొన్నారు.

తాడేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ముగ్గురోడ్డు, లంబాడీపేట, ఆర్ఎంఎస్ కాలనీ ప్రాంతాల్లో తాడేపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బందితోపాటు స్పెషల్ పార్టీ పోలీసులు మూడు టీమ్‌లుగా ఏర్పడి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం మత్తులో ఇద్దరు యువకులు ఘర్షణ పడగా అందులో ఒక యువకుడిని స్నేహితుడు బీర్ బాటిల్‌తో గాయపరిచాడని, ఈ నేపథ్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్టు వివరించారు. ఈ ఘటనపై దుష్ప్రచారం జరుగుతోందని, అందులో వాస్తవం లేదని వెల్లడించారు. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం ఇద్దరు స్నేహితులు మద్యం తాగుతూ ఘర్షణపడి పరస్పరం దాడి చేసుకున్నారని, అదేరోజు దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు మద్యం మాత్రమే తాగారని, గంజాయి కాదని చెప్పారని వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నలుగురు ఎస్‌ఐలు, ఒక ఏఎస్‌ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 30 మంది స్టేషన్ సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని, మత్తు పదార్థాలు లభించలేదని సీఐ తెలిపారు. ఎస్‌ఐలు వినోద్, రమేష్, నారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తుళ్లూరు సీఐగా శేషగిరిరావు

తాడికొండ: తుళ్ళూరు సీఐగా శేషగిరిరావు నియమితులైన నేపథ్యంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సుల్తాన్ బాషాను బదిలీ చేస్తూ ఆ స్థానంలో శేషగిరిరావును నియమించారు. ఈ సందర్భంగా గురువారం తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌ను ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ చెప్పారు. మండలంలోని మునగపాడు గ్రామంలో బొడ్డురాయి సెంటర్ నుంచి గుండాలపాడు వెళ్లే దారిలోని జెండా చెట్టు వరకు మండల పరిషత్ నిధులతో వేస్తున్న సీసీ రోడ్డును గురువారం ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ పరిశీలించారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

త్రీడీ ప్రింటింగ్‌పై అవగాహన

మంగళగిరి: నగర పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో గురువారం త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ ఇన్ ఫార్మసీ అండ్ బయోమెడికల్ సైన్సెస్ అనే అంశంపై ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఫార్మసీ రంగంలో త్రీడీ ప్రింటింగ్ ఆవశ్యకత, త్రీడీ ప్రింటింగ్ పరికరం ద్వారా టాబ్లెట్లు, క్యాప్సూల్స్, సర్జికల్ వస్తువులు తయారు చేయడం, ముద్రించడంపై నాందేడు ఇందిరా కాలేజి ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కటకం ప్రకాష్ విద్యార్థులకు వివరించారు.

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన

తాడేపల్లిరూరల్ : ప్రాతూరులోని ఏఐఎంఈఈ ఇంటర్నేషనల్ స్కూల్లో గురువారం చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి క్లబ్ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి, ముఖ్య అతిథి ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యల్లా శివప్రసాద్ అంతరిక్ష పరిశోధనల గురించి వివరించారు. ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వినతి

మంగళగిరి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి మున్నా మాట్లాడుతూ నగరంలోని ప్రైవేటు పాఠశాల అయిన సెయింట్ ఫ్రాన్సిస్ స్కూలు యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా అధిక గంటలు తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఒత్తిడికి, వేదనకు గురి చేస్తోందని విమర్శించారు. దీని వల్ల విద్యార్థులు శారీరక, మానసిక వికాసాన్ని కోల్పోయే ప్రమాదముందన్నారు.

స్పర్శలేని మచ్చను కుష్టుగా గుర్తించాలి

ఫిరంగిపురం: శరీరంపై స్పర్శ లేకుండా రాగి రంగులో ఉన్న మచ్చను కుష్టు వ్యాధిగా గుర్తించవచ్చని ఏపీఎంవో ఎం.శ్రీనివాసరావు చెప్పారు. నుదురుపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం కుష్టు పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నేడు చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం నిడమర్రు రోడ్డు మహాలక్ష్మి గార్డెన్స్ ఆవరణలో చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేయనున్నట్లు ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ ఇసునూరి అనిల్ చక్రవర్తి తెలిపారు. నగరంలోని ఐబీఎస్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోటరీ ఫోకస్ ఏరియా ఎకనమిక్ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని చిరు వ్యాపారులకు చేయూత చక్రాలు పేరుతో సుమారు రూ.22.80 లక్షల విలువైన 200 తోపుడు బండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం నీరుకొండలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

గుంటూరు పీఠాధిపతులు చిన్నా బత్తిన భాగ్యయ్య

మేడికొండూరు: క్రీస్తు మార్గం అనుసరణీయమని గుంటూరు మేత్రాసనం పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య చెప్పారు. మేడికొండూరు మండలంలోని డోకిపర్రు అంబేడ్కర్ నగర్ కాలనీలో గురువారం పునీత నిత్య సహాయ మాత ఆలయ 26వ వార్షికోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా చిన్నాబత్తిన భాగ్యయ్య పాల్గొన్నారు. పండుగ ప్రత్యేక పూజాబలి నిర్వహించారు. స్థానిక విచారణ గురువు నుదురుపాటి చంద్రమోహన్ వాక్యోపదేశం చేశారు. పలువురు మహిళలు క్రైస్తవ గీతాలు ఆలపించారు. రాత్రికి బాణసంచా మిరుమిట్లు, మేళతాళాల మధ్య గ్రామ వీధుల్లో తేరు ప్రదక్షణ జరిగింది. అనంతరం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి.

గుంటూరు వెళ్లి పెన్షన్ అందజేత

మేడికొండూరు: మేడికొండూరు మండల కేంద్రానికి చెందిన షేక్ షర్ఫుద్దీన్ ఇటీవల అనారోగ్యానికి గురై గుంటూరు కారుమూరి శ్రీనివాసరెడ్డి ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకుంటున్నారు. అతనికి వచ్చిన పింఛన్‌ను వలంటీర్ గుంటూరు ఆస్పత్రికి వెళ్లి మరీ అందించారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

తాడేపల్లిరూరల్ : కేంద్ర బడ్జెట్ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించేలా ఉందని గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నేతాజీ సెంటర్‌లో రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కూ తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల అధ్యక్షులు ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ సుబ్బారెడ్డి, భక్తిరెడ్డి, అంజి, శ్రీరామ్, కరుణ తదితరులు పాల్గొన్నారు.